



అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన అనంతరం భోజనం చేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్, టీడీపీ, జనసేన నాయకులు

విద్యా శాఖలో కలకలం!

ఏసీబీ వలలో ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్

- పరీక్షా కేంద్రం మంజూరుకు డబ్బులు డిమాండ్
- రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం
- జిల్లా విద్యాశాఖ వివిధ విభాగాల్లో ఏసీబీ సోదాలు



ఏసీబీకి పట్టుబడిన ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్ కుమార్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఓపెన్ స్కూల్స్ విభాగం జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేస్తున్న అధికారి లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులకు పట్టుబడడం విద్యా శాఖలో కలకలం రేపింది. కొప్పాకలోని డీఈవో కార్యాలయంలోనే రూ.30 వేలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయిన సార్వత్రిక పాఠశాలల సమన్వయకర్త ఒ.కుమార్‌పై కేసు నమోదు చేశారు. ఏసీబీ కోర్టులో హాజరు పర్చిన అనంతరం రిమాండ్‌కు తరలించారు. ఓపెన్ స్కూల్స్ విభాగంలో తనిఖీలు ముగించిన ఏసీబీ అధికారులు.. లంచం సొమ్ములో ఎవరెవరికి, ఎంతెంత వాటాలు ఉన్నాయన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

ఎలమంచిలికి చెందిన పి.ఈశ్వరదత్తు అనే ఒక ప్రైవేటు కళా శాల ప్రిన్సిపాల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణ కేంద్రం కోసం విద్యా శాఖకు చెందిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందారు. అయితే ఈ కేంద్రానికి సంబంధించిన డిజిటల్ కీని జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో ఓపెన్ స్కూల్స్ కో-ఆర్డినేటర్ క్షేత్ర పర్యటన చేసిన తరువాత ఇవ్వాల్సి ఉంది. ఈశ్వరదత్తు వారం రోజుల కిందట కోఆర్డినేటర్ కుమార్‌ను సంప్రదించారు. డిజిటల్ కీ ఇవ్వాలంటే రూ.35 వేలు లంచంగా ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో ఆయన విశాఖపట్నంలోని ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు బుధవారం మధ్యాహ్నం 12.10 గంటల సమయంలో ఈశ్వరదత్తు డీఈవో కార్యాలయానికి వెళ్లి ఓపెన్ స్కూల్స్ కోఆర్డినేటర్ ఒ.కుమార్‌కు రూ.30 వేలు ఇచ్చారు. ఆయన నగదును టేబుల్ సొరుగులో పెడుతుండగా.. అప్పటికే ... మిగతా 8వ పేజీలో

అక్రమ లేఅవుట్‌లు!

నాలా పన్ను చెల్లించకుండా దర్జాగా వెంచర్లు

- లేఅవుట్‌లలో యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన
- వెంచర్ల పక్కన ఉన్న గెడ్డలు కబ్జా
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఆగని రియల్టర్ల దందా



అనకాపల్లిలో పూర్తిస్థాయి అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అక్రమ లేఅవుట్‌లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అక్రమ లేఅవుట్లు వేసిన రియల్టర్లు... ఇప్పుడు కూటమి నేతలతో అంటకాగుతూ అనుమతులు లేకుండా ఇళ్ల స్థలాల లేఅవుట్లు వేస్తున్నారు. అభూత ప్రకటనలతో ప్రజలను నమ్మించి, ప్లాట్లను విక్రయిస్తున్నారు. జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కార్యాలయం పరిధిలో పదుల సంఖ్యలో అక్రమ లేఅవుట్‌లు వేసిన రియల్టర్లు.. వీటిల్లో కొన్నిటికి మాత్రమే అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. అనుమతి లేకుండా వెంచర్లు వేస్తున్నప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి అయినా చూడడం లేదు.

జాతీయ రహదారిని అనుకొని వున్న సబ్బవరం, అనకాపల్లి, మునగపాక, కశింకోట, ఎలమంచిలి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేటతోపాటు పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న పరవాడ, అచ్యుతాపురం మండలాల్లో రోజులో అక్రమ లేఅవుట్ వెలుస్తున్నది. అనకాపల్లి మండలంలో జాతీయ రహదారిని ఆనుకొని అనకాపల్లి సౌత్-2 ఆవఖండం భూముల్లో అధికార పార్టీకి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి ఎటువంటి అనుమతులు



సబ్బవరంలో లేఅవుట్‌కు ఆనుకొని సర్వే నంబరు 259లో ఉన్న గెడ్డవాగును ఆక్రమించి పూడ్చివేసిన రియల్టర్లు

పొందకుండానే 24 ఎకరాల్లో భారీ వెంచర్ వేశారు. జీవీఎంసీకి దరఖాస్తు మాత్రమే చేసి, 'ఆన్ ప్రాసెసింగ్' పేరుతో ఎల్‌పీ నంబరు 0006/2024గా జీవీఎంసీ అనుమతి ఇచ్చినట్టు ప్రచారం చేసుకుంటూ ప్లాట్‌లు విక్రయిస్తున్నారు. కాగా వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించాలంటే నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ ట్యాక్స్) చెల్లించాలి. రియల్టర్లతో కుమ్మక్కైన రెవెన్యూ ఉద్యోగులు.. నాలా రుసుమును మొక్కుబడిగా వసూలు చేసి చేతులు దులుపుకుంటున్నారు.

ల్యాండ్ కన్వర్షన్ అనుమతులు లేకుండానే...

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో కూడా రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలోని పలు మండలాల్లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థలు, వివిధ ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు పొందకుండానే భారీ లేఅవుట్‌లు వేసి, ప్లాట్లను విక్రయిస్తున్నారు. కశింకోట, మునగపాక, కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో ఇటీవల కాలంలో పంచాయతీ అనుమతుల పేరుతో లేఅవుట్‌లు వేస్తున్నారు. నిబంధల ప్రకారం తొలుత వ్యవసాయ భూములను వ్యవసాయేతర భూములుగా మార్చాలి. 33 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్లు, మురుగు నీటిఇ పారుదలకు కాలువల నిర్మాణాలు చేపట్టాలి. లేఅవుట్‌లో విద్యుత్ స్తంభాలు వేసి, తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు చేయాలి. లేఅవుట్‌లో పది శాతం భూమిని సామాజిక అవసరాలకు విడిచిపెట్టాలి. గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్‌లకు ముందుగా పంచాయతీలో తీర్మానం చేసిన తరువాత సాంకేతిక పరిశీలన పూర్తయిన తరువాత అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అదే మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో కూడా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందాలి. కానీ రియల్టర్లు ఇవేమీ పట్టించుకోవడం లేదు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల అండతో నాలా పన్ను చెల్లించకుండానే వెంచర్లు వేస్తున్నారు.

సబ్బవరంలో సర్వే నంబరు 256లో సుమారు 22 ఎకరాల జిరాయితీ భూమి వుంది. ఇందులో 10.91 ఎకరాల్లో ఇటీవల ... మిగతా 8వ పేజీలో

పేదల కోసమే అన్న క్యాంటీన్‌లు

- స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు
- నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి ఎదుట ప్రారంభం

నర్సీపట్నం, సెప్టెంబరు 18: అన్న క్యాంటీన్లు పేద వాళ్ల కోసం ఏర్పాటు చేసినవని, వారు సద్వినియోగం చేసుకునేలా అందరూ సహకరించాలని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. బుధవారం ఏరియా ఆస్పత్రి ఎదుట అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్‌తో కలిసి ప్రారంభించారు. డైనింగ్ హాల్‌ను చింతకాయల పద్మావతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూ.5లకే ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెట్టాలన్న ఉద్దేశంతో 2019లో టీడీపీ అధికారంలో వున్నప్పుడు రాష్ట్రంలోని పలు నగరాలు, పట్టణాల్లో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామని గుర్తు చేశారు. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటిని మూసేసిందని, అయినప్పటికీ నర్సీపట్నంలో తన భార్య పద్మావతి, అన్నపూర్ణ అక్షయ పాత్ర ద్వారా ఐదేళ్ల నుంచి పేదలకు భోజనం పెడుతున్నామని చెప్పారు. టీడీపీ మళ్లీ అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను తెరవాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. ఆస్పత్రికి వచ్చే రోగుల, పేదలు అన్న క్యాంటీన్‌ను సద్వినియోగం చేసుకునేలా అందరూ సహకరించాలని కోరారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్న క్యాంటీన్‌ని, ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, చింతకాయల రాజేశ్, దివ్య, జనసేన నేత సూర్యచంద్ర, మునిసిపల్ కమిషనర్ సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో 2న అన్న క్యాంటీన్ ప్రారంభం

- రూ.10 లక్షలతో కొమ్మాయిగుండం వద్ద భవన నిర్మాణం



అన్న క్యాంటీన్ కోసం ఎలమంచిలిలో నిర్మించిన నూతన భవనం

ఎలమంచిలి, సెప్టెంబరు 18: పట్టణంలోని కొమ్మాయిగుండం వద్ద నిర్మించిన అన్న క్యాంటీన్‌ను గాంధీ జయంతి సందర్భంగా వచ్చే నెల రెండో తేదీన ప్రారంభించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వాస్తవంగా తెలుగుదేశం పార్టీ అధికారంలో వున్నప్పుడు 2019లోనే కొమ్మాయిగుండం వద్ద అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. నిత్యం వందలాది మంది రూ.5లకే ఉదయం అల్పాహారం/ మధ్యాహ్నం/ రాత్రి భోజనం చేసేవారు. కానీ తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు, అన్న క్యాంటీన్‌ను మూసివేయించారు. అయినప్పటికీ టీడీపీ అధిష్ఠానం పిలుపుతో ఎన్నారై మహిళా విభాగం ఆర్థిక ఆసరాతో పార్టీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావుల పర్యవేక్షణలో స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద అన్న క్యాంటీన్‌ను నిర్వహించారు. కూటమి ప్రభుత్వం రావడంతో అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభిస్తున్నారు. ఇందుకోసం ఎలమంచిలి కొమ్మాయిగుండం వద్ద రూ.10 లక్షలతో భవనం నిర్మించారు. మరో పక్షం రోజుల్లో అన్న క్యాంటీన్ అందుబాటులోకి రానున్నది.

ఆస్పత్రి అభివృద్ధికి కృషి

నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించను : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- పలు అంశాలపై సూపరింటెండెంట్‌కు ప్రశ్నల వర్షం
- కలెక్టర్‌తో కలిసి ఏరియా ఆస్పత్రిపై సమీక్ష



ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, సెప్టెంబరు 18: "ఏరియా ఆస్పత్రి నా మానస పుత్రిక. దీనిని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తాను. కానీ ఆస్పత్రి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేది లేదు" అని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి స్థానిక ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్, వైద్యులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ఈ ఆస్పత్రిలో ప్రతి నెలా సుమారు 500 డెలివరీలు జరిగేవని, ఇప్పుడు ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణిదేవిని అడిగారు. ప్రసూతి కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు ఎందుకు రిఫర్ చేస్తున్నారని ప్రశించారు. పాముకాటుకు గురైౖ ఆస్పత్రికి వచ్చిన బాధితుడికి చికిత్స చేయకుండా ప్రైవేటు ఆస్పత్రికి ఎందుకు పంపారో చెప్పాలని నిలదీశారు. దీనిపై విచారణ జరిపి, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల నుంచి ఇక్కడ పనిచేస్తున్న కొంతమంది సిబ్బంది డబ్బులు వసూలు చేస్తున్నారని, వీరిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ప్రైవేటు అంబులెన్స్‌లకు నిర్దిష్ట చార్జీలు నిర్ణయించాలని చెప్పారు. ఆపరేషన్ థియేటర్‌కు అవసరమైన పరికరాలు సమకూర్చడానికి, ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు కృషి చేస్తానని అయ్యన్నపాత్రుడు చెప్పారు. బ్లడ్ కలెక్షన్ వెహికల్ పని చేస్తుందా? అని ప్రశ్నించారు. గత ఐదేళ్లలో ఎన్ని యూనిట్ల బ్లడ్ సేకరించారని అడిగారు. ఆయుష్ ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయి ఐదేళ్లు అవుతున్నదని, దానిని నిరూపయోగంగా ఎందుకు ఉంచారని అధికారులను ప్రశ్నించారు.

కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ, ప్రాంతీయ ఆస్పత్రికి కొత్త అంబులెన్స్‌లు మంజూరు చేస్తామని చెప్పారు. అంతకు ముందు ఫార్మశీ, ఎక్స్‌రే యూనిట్, రక్త పరీక్షా కేంద్రం, ఆర్థో విభాగం, నవ జాత శిశు సంరక్షణ కేంద్రం, డయాలసిస్ యూనిట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జయరాం, డీసీహెచ్ఎస్ డాక్టర్ శంకర్ ప్రసాద్, జనసేన ఇన్‌చార్జి సూర్యచంద్ర, కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్‌గా ఉమామహేశ్వరి

విశాఖ జిల్లా డీఆర్‌గా ఉపేంద్ర

- అల్లూరి డీఆర్‌గా రామలక్ష్మి పట్నాయక్
- డీఐజీ బాలకృష్ణ ఇక్కడే కొనసాగింపు
- నేడు సబ్ రిజిస్ట్రార్ బదిలీలకు మార్గదర్శకాలు?

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో డీఐజీలు, జిల్లా రిజిస్ట్రార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న పి.ఉమామహేశ్వరిని అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. అనకాపల్లి జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సీహెచ్.జానకీదేవిని నంద్యాల జిల్లా రిజిస్ట్రార్‌గా బదిలీ చేశారు. విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న ఎం.సృజనను తాడేపల్లి బదిలీ చేశారు. ఒంగోలులో పనిచేస్తున్న టి.ఉపేంద్రను విశాఖ జిల్లా రిజిస్ట్రార్‌గా, కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా రిజిస్ట్రార్‌గా నియమించారు. శ్రీకాకుళం జిల్లా రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.మన్మథరావును విశాఖ జిల్లా మార్కెట్ విలువలు, ఆడిట్ రిజిస్ట్రార్‌గా వేశారు. విశాఖ డీఐజీగా పనిచేస్తున్న బాలకృష్ణను ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

మార్గదర్శకాలకు కసరత్తు

సబ్ రిజిస్ట్రార్ల బదిలీల కోసం ఇంకా మార్గదర్శకాలు తయారు చేయలేదు. బుధవారం రాత్రికి గాని, గురువారం కాని వస్తాయని అంటున్నారు. విశాఖపట్నం జిల్లాలో పనిచేయడానికి అనేకమంది ఆసక్తి చూపిస్తున్నారు. ప్రభుత్వం ఐదేళ్లు ఒకేచోట సర్వీసు పూర్తి చేసుకున్నవారికి బదిలీ చేయాలని సూచించింది. అయితే రెండేళ్లు దాటిన వారి నుంచి కూడా దరఖాస్తులు ఆహ్వానించింది. నేరుగా ఉన్నతాధికారులే బదిలీ చేస్తారా?, కౌన్సెలింగ్ నిర్వహిస్తారా? అనేది ఇంకా స్పష్టత లేదు. కొన్ని జిల్లాల్లో సబ్ రిజిస్ట్రార్ పోస్టుల కోసం లక్షల రూపాయలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నారని వార్తలు రావడంతో ప్రభుత్వం బదిలీలను సీరియస్‌గా తీసుకుంది. ఆరోపణలకు తావు లేని విధంగా చేయాలని భావిస్తోంది. సబ్ రిజిస్ట్రార్ల పోస్టులకు కూడా ఎమ్మెల్యేలు సిఫారసు లేఖలు ఇచ్చారు. వాటిని ఉన్నతాధికారులు పరిగణనలోకి తీసుకుంటారా?, లేదా? అనేది చూడాలి. జిల్లా రిజిస్ట్రార్ల బదిలీల్లో కొన్నింటిని రాజకీయ సిఫారసులను దృష్టిలో పెట్టుకొని చేశారు. కాబట్టి ఎమ్మెల్యేలు కోరుకున్నవారే జిల్లాలో కీలక స్థానాల్లోకి వచ్చే అవకాశం ఉందంటున్నారు.

హైస్కూల్ బాలికలకు హాస్టళ్లు

వడ్డాది, జె.నాయుడుపాలెంలో కస్తూర్బా వసతిగృహాలు

- గాంధీ జయంతి రోజున ప్రారంభం
- పాలిటెక్నిక్ కళాశాల, జ్యోతిబాపూలే స్కూల్‌కు చోడవరంలోనే సొంత భవనాలు
- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



కస్తూర్బా గాంధీ బాలికల వసతిగృహాల మంజూరుకు సంబంధించిన ఉత్తర్వులను చూపిస్తున్న ఎమ్మెల్యే రాజు, మల్లునాయుడు, తదితరులు

చోడవరం, సెప్టెంబరు 18: నియోజకవర్గంలో ఉన్నత పాఠశాలల బాలికల కోసం రెండుచోట్ల (టైప్ ఫోర్) కస్తూర్బా గాంధీ వసతిగృహాలు అందుబాటులోకి రానున్నట్టు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు వెల్లడించారు. బుధవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, రోలుగుంట మండలం జె.నాయుడుపాలెం, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో గత టీడీపీ హయాంలోనే కస్తూర్బా హాస్టళ్లు మంజూరు చేసి, భవనాలు కూడా నిర్మించామని, కానీ వైసీపీ పాలకులు వాటిని ప్రారంభించకుండా గాలికొదిలేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కస్తూర్బా వసతిగృహాలను ప్రారంభించి, భవనాలను వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. వసతిగృహాలను అందుబాటులోకి తీసుకురావడానికి రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్ పీడీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించకుని అక్టోబరు రెండో తేదీన వీటిని ప్రారంభించడానికి చర్యలు చేపట్టామని, హాస్టళ్లకు అవసరమైన సిబ్బందిని డీఈవో నియమిస్తారని ఎమ్మెల్యే చెప్పారు. హైస్కూళ్లలో చదువుకుంటున్న స్థానికేతర విద్యార్థినులకు ఈ వసతిగృహాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన అన్నారు.

చోడవరంలోనే పాలిటెక్నిక్ కళాశాల, జ్యోతిబాపూలే స్కూల్ భవనాలు

చోడవరంలో ఇంతవరకు సొంత భవనాలు లేని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు పట్టణంలోనే వసతి సమకూరుస్తామని ఎమ్మెల్యే రాజు చెప్పారు. గత ప్రభుత్వం వీటికి సొంత భవనాల కోసం వెంకన్నపాలెం, జన్నవరంలో స్థలాలు ఎంపిక చేసిందని, పట్టణానికి దూరంగా వుండడం వల్ల రాకపోకలకు విద్యార్థులు ఇబ్బంది పడతారని అన్నారు. ఈ సమస్యను తొలగించడానికి రెండు విద్యా సంస్థలకు ఒకేచోట అనువైన స్థలాలు గుర్తించామని ఆయన తెలిపారు. చోడవరంలో అసంపూర్తిగా వున్న రెవెన్యూ కార్యాలయం, రైతు బజార్‌లను త్వరలోనే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో 50 పడకలస్థాయికి అవసరమైన వసతులు వున్నాయని, దీనిని అప్‌గ్రేడ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన చెప్పారు. విలేకరుల సమావేశంలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, టీడీపీ నాయకులు కనిశెట్టి మత్స్యరాజు, గూనూరు జోసెఫ్ పాల్గొన్నారు.



రోలుగుంట మండలం జె.నాయుడుపాలెంలో బాలికల హాస్టల్ కోసం నిర్మించిన భవనం

ఎలమంచిలి కమిషనర్‌గా ప్రసాదరాజు బాధ్యతలు స్వీకరణ



కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రసాదరాజు

ఎలమంచిలి, సెప్టెంబరు 18: స్థానిక మునిసిపల్ కమిషనర్‌గా బీజే ఎస్ ప్రసాదరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి మునిసిపాలిటీ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కార్యాలయం ఉద్యోగులు నూతన కమిషనర్‌ను కలిసి అభినందనలు తెలిపారు. గతంలో ఎలమంచిలి మునిసిపల్ కమిషనర్‌గా పనిచేశానని, పట్టణంపై తనకు పూర్తి అవగాహన వుందని, అందరి సహాయ సహకారాలతో మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు.

జీవీఎంసీలో నేడు18 అన్న క్యాంటీన్లు ప్రారంభం

రేపు ఐదు, ఎల్లుండి రెండు అందుబాటులోకి..

విశాఖపట్నం, సెప్టెంబరు 18(ఆంధ్రజ్యోతి): మహా విశాఖ నగరపాలక సంస్థ పరిధిలో అన్న క్యాంటీన్లు గురువారం రాత్రి నుంచి దశలవారీగా అందుబాటులోకి రానున్నాయి. మొత్తం 25 క్యాంటీన్లలో 17 క్యాంటీన్లను.. ఆరిలోవ, విమ్స్ ఆస్పత్రి, ఎంవీపీ కాలనీ రైతుబజార్, టీబీ ఆస్పత్రి, కేజీహెచ్ ఓపీ గేటు దరి, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణా మార్కెట్ దరి ఫ్రూట్ మార్కెట్, చిట్టివలస, పెందుర్తి, మారికివలస, అనకాపల్లిలో రైల్వేస్టేషన్ దరి, ఎన్టీఆర్ ఆస్పత్రి, వేపగుంట, ములగాడ, శ్రీహరిపురం నమ్మిదొడ్డి, చినగంట్యాడ, ఆటోనగర్‌లో గురువారం రాత్రి భోజనంతో అందుబాటులోకి వస్తాయి. 20వ తేదీ ఉదయం గోపాలపట్నంలో

ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఛారిటబుల్ ఫౌండేషన్‌కు బాధ్యతలు

అల్పాహారంతో, మధ్యాహ్నం భోజనంతో బాజీ జంక్షన్, తాటిచెట్లపాలెం వైఎస్సార్ కాలనీ, భీమిలి, మధురవాడ వాంబే కాలనీ, 21వ తేదీ ఉదయం మర్రిపాలెంలో అల్పాహారంతో, ప్రాంతీయ కంటి ఆస్పత్రి వద్ద మధ్యాహ్న భోజనంతో క్యాంటీన్లు ప్రారంభం కానున్నాయి. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనాల సరఫరా, క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలను హరేకృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్‌కు అప్పగించారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో కూలీ మృతి


మృతిచెందిన వెంకటరమణ

గొలుగొండ, సెప్టెంబరు 18: కూలి పనికి వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన విషాద సంఘటన మండలంలోని చినపెదపేటలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గొలుగొండ మండలం ఏటిగైరంపేటకు చెందిన వూటా వెంకటరమణ (48) బుధవారం ఉదయం రోలుగుంట మండలం చినపెదపేటలోని ఒక రైతుకు సంబంధించిన పొలంలో పనికి వెళ్లాడు. పొలం పనులు చేస్తుండగా త్రీఫేస్ విద్యుత్‌లైన్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అపస్మారక స్థితికి చేరాడు. మిగతా కూలీలు అతడిని వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. రోలుగుంట ఎస్‌ఐ రామకృష్ణారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి బంధువులకు అప్పగించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

50 కిలోల గంజాయి స్వాధీనం : ఇద్దరి అరెస్టు

» కారు, మూడు సెల్‌ఫోన్లు సీజ్


పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

చీడికాడ, సెప్టెంబరు 18: మండలంలోని అప్పలరాజుపురం చెరకు కాటా వద్ద 50 కిలోల గంజాయిని పట్టుకొని ఇద్దరు నిందితులను చోడవరం కోర్టుకు తరలించినట్టు ఎస్‌ఐ బి.సతీష్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి.

కర్ణాటకకు చెందిన పి.వీర (42), చిన్నస్వామి (44) ఈ నెల 15న కారులో అల్లూరి జిల్లా పెదబయలు మండలం బోమంగి గ్రామానికి వచ్చారు. ఆ గ్రామంలో ఒక వ్యక్తి వద్ద గంజాయిని కొనుగోలు చేసి ఈ నెల 17న కోనాం మీదుగా అప్పలరాజుపురం వైపు వస్తుండగా, వారి కారు తనిఖీ చేయగా 50 కిలోల గంజాయి పట్టుబడింది. దీంతో వీరిద్దరిని స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. కారు, మూడు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. కె.కోటపాడు సీఐ పైడంనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ చెప్పారు.

30 కిలోల గంజాయి స్వాధీనం

» ముగ్గురి అరెస్టు


పట్టుబడిన నిందితులు, గంజాయితో పోలీసులు

సబ్బవరం, సెప్టెంబరు 18: సబ్బవరం మీదుగా విశాఖపట్నానికి తరలిస్తున్న 30 కిలోల గంజాయిని స్థానిక పోలీసులు స్వాధీనం చేసు కుని ముగ్గురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించి పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ఎస్‌ఐ పి.సింహాచలం సిబ్బందితో ఎన్టీఆర్ జంక్షన్‌లో వాహనాలు తనిఖీ చేస్తున్నారు. చోడవరం నుంచి సబ్బవరం వైపు ద్విచక్ర వాహనంపై ఇద్దరు వ్యక్తులు వస్తుండగా వారిని ఆపి ప్రశ్నించారు. వీరిలో ఓ వ్యక్తి పరారయ్యాడు. మరో వ్యక్తి ముక్కా లోహిదాస్‌గా పోలీసులు గుర్తించారు. అతనిని ప్రశ్నించగా వెనుక గంజాయితో వస్తున్న ఆటోకు పైలట్‌గా వస్తున్నట్టు చెప్పాడు. వెనుక వస్తున్న ఆటోను ఆపి పరిశీలించగా అందులో ఇద్దరు వ్యక్తులు ఉన్నారు. ఆటోలో తనిఖీలు చేయగా 30 కిలోల గంజాయి పట్టుబడింది. ఆటోలో ఉన్న గుద్దె సురేశ్, కిముడు మోహన్‌లను ప్రశ్నించగా ముంచంగిపుట్టు మండలం పెదగూడెం నుంచి విశాఖపట్నంలో ఓ వ్యక్తికి అప్పగించేందుకు తరలిస్తున్నట్టు చెప్పారు. కాగా పరారైన వ్యక్తితో పాటు మరో ముగ్గురు తప్పించుకున్నారని, వారి కోసం గాలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. గంజాయితో పాటు నిందితులను పట్టుకున్న సీఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐ సింహాచలంతో పాటు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

అదుపు తప్పిన ప్రైవేటు బస్సు

» పలువురికి గాయాలు



పంట పొలాల్లోకి దూసుకు వెళ్లిన బస్సును పరిశీలిస్తున్న పోలీసులు

కొత్తూరు, సెప్టెంబరు 18: అనకాపల్లి మండలం మార్టూరు గ్రామం సమీపంలో ప్రైవేటు బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలంలోకి దూసుకెళ్లింది. అనకాపల్లి రూరల్ ఏఎస్‌ఐ సింగంపల్లి భాస్కరరావు, స్థానికులు తెలిపిన వివరాలివి. చీడికాడ నుంచి అచ్యుతాపురం బ్రాండెక్స్ కంపెనీకి ఉద్యోగులను తీసుకెళుతున్న బస్సు మార్టూరు గ్రామ సమీపంలో వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 45 మందిలో 10 మంది మహిళా కార్మికులు స్వల్పంగా గాయపడగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.. వీరికి అనకాపల్లిలో ఉన్న పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రథమ చికిత్స అందించి ఇంటికి పంపించారు. ఈ సంఘటనకు సంబంధించి బస్సులో ప్రయాణిస్తున్న కార్మికురాలు దేవర రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్‌ఐ చెప్పారు.

ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు పట్టివేత

» రూ.10 వేల చొప్పున జరిమానా


పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు

మాకవరపాలెం, సెప్టెంబరు 18 : సర్పానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాకర్లను పట్టుకున్నట్టు ఎస్‌ఐ దామోదర్ నాయుడు తెలిపారు. ఒక్కో ట్రాక్టరుకు రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్టు చెప్పారు. ఎక్కడైనా అనుమతులు లేకుండా అక్రమ ఇసుక వ్యాపారం నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554


కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా బుధవారం మంగళగిరిలోని ఒక ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, హోం మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు, బండారు సత్యనారాయణమూర్తి, కొణతాల రామకృష్ణ, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గణబాబు, విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు.

కబడ్డీ పోటీల్లో 'పేట' విద్యార్థుల ప్రతిభ


కబడ్డీ పోటీల్లో బంగారు పతకం సాధించిన విద్యార్థులు

పాయకరావుపేట, సెప్టెంబరు 18: సీబీఎస్‌ఈ నిర్వహించిన క్లస్టర్-7 కబడ్డీ పోటీల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి బంగారు పతకం సాధించడంతో పాటు త్వరలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని బుధవారం విద్యా సంస్థల యాజమాన్యం అభినందించింది.

ఈనెల 14 నుంచి 17వ తేదీ వరకు గద్వాల్‌లోని ఎస్‌ఆర్.విద్యానికేతన్‌లో సీబీఎస్‌ఈ బోర్డు క్లస్టర్-7(ఆంధ్రా, తెలంగాణ) కబడ్డీ పోటీల్లో అండర్-14, అండర్-19 బాలుర విభాగాల్లో తమ విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించడంతోపాటు వచ్చే నెల 17 నుంచి 20వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్ జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని యాజమాన్యం తెలిపింది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు జరిగిన సీబీఎస్‌ఈ క్లస్టర్-7 పోటీల్లో 30 మంది తమ విద్యార్థులు బంగారు పతకాలు సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్‌తోపాటు పలువురు ఉపాధ్యాయులు, కోచ్‌లు లక్ష్మణ్, చినరాజు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

న్యాయ విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరం

» గోవా లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ వెంకటరావు


ప్రొఫెసర్ ఆర్.వెంకటరావును జ్ఞాపికతో సత్కరిస్తున్న లా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు

సబ్బవరం, సెప్టెంబరు 18: న్యాయ విద్యను అభ్యసించే విద్యార్థులకు సామాజిక బాధ్యత అవసరమని గోవా ఇంటర్నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ ఆర్.వెంకటరావు అన్నారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో కొత్తగా మూడేళ్ల న్యాయ విద్యను ప్రవేశ పెట్టిన సందర్భంగా ఆ విద్యార్థులకు బుధవారం వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశ్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వెంకటరావు మాట్లాడుతూ సమాజంపై అవగాహన పెంచుకునేందుకు న్యాయ విద్యార్థులందరూ తప్పనిసరిగా చరిత్ర, సామాజిక శాస్త్రం, పొలిటికల్ సైన్స్‌లపై పట్టు సాధించాలని సూచించారు. ఇంజనీరింగ్, చార్టెడ్ అకౌంటెంట్లు న్యాయ శాస్త్రంపై పట్టు కోసం ఆసక్తి చూపిస్తున్నారన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తమ పురోగతిని సమీక్షించుకుంటూ ముందుకు సాగినప్పుడే వ్యక్తిగతంగా, సామాజికంగా అభివృద్ధి సాధ్య మన్నారు. వీసీ ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ దేశంలో మూడేళ్ల న్యాయ విద్యను అందిస్తున్న మూడవ విశ్వవిద్యాలయం డీఎస్ఎన్ఎల్‌యూ అన్నారు. ఈ విశ్వవిద్యాలయం నుంచి ప్రతి ఏడాది 70 లక్షల విలువైన జర్నల్స్, ఆన్లైన్ రిసోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, విద్యార్థులు వాటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ విశ్వచంద్రనాథ్ మాదాసు, అకడమిక్ డైరెక్టర్ సోమా భట్టాచార్య, ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ కె.సుధ, డాక్టర్ దయానందమూర్తి, డాక్టర్ టీవై నిర్మలాదేవి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రమాదకర ప్రయాణాలు

» సరిపడా ఆర్టీసీ బస్సులు లేక ఇబ్బందులు


ఆర్టీసీ బస్సు ఫుట్‌పాత్‌పై నిలబడి ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట, సెప్టెంబరు 18: పాయకరావుపేటలోని వివిధ విద్యా సంస్థల్లో చదువుతున్న వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు రోజూ ఆర్టీసీ బస్సుల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. పాయకరావుపేట పట్టణంలో ఉన్న పలు ప్రైవేటు విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వివిధ కళాశాలల్లో చదువుతున్న మండలంలోని జాతీయ రహదారి ఇరువైపులా ఉన్న గ్రామాలతోపాటు నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన వందలాది మంది విద్యార్థులు రోజూ ఆర్టీసీ బస్సులు, ఆటోలు, వివిధ వాహనాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. వీరిలో అత్యధికులు ఆర్టీసీ సర్వీసుల్లో ప్రయాణాలు సాగిస్తుండడంతో ఉదయం, సాయంత్రం విద్యార్థులతో బస్సులు రద్దీగా ఉంటున్నాయి. ముఖ్యంగా సాయంత్రం సమయంలో ఇళ్లకు వెళ్లే విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఆర్టీసీ సర్వీసులు లేనికారణంగా ఆయా సమయాల్లో ఆర్టీసీ బస్సుల్లో ఫుట్‌పాత్‌పై నిలబడి మరీ ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు సాగిస్తున్నారు. విద్యార్థులను తీసుకువెళ్లే పలు ఆటోల్లో కూడా 20 మందికిపైగా విద్యార్థులు కిక్కిరిసి కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ వాహనాలన్నీ జాతీయ రహదారిపైనే ఎక్కువ సమయం ప్రయాణం చేస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలు పరిమితికి మించి ఎక్కించుకోకుండా చర్యలు తీసుకోవడంతోపాటు సాయంత్రం సమయంలో ఆర్టీసీ సర్వీసులు పెంచాలని కోరుతున్నారు.

గిరినాగు హల్‌చల్


గిరి నాగును పట్టుకున్న స్నేక్ క్యాచర్ కృష్ణ

దేవరాపల్లి, సెప్టెంబరు 18 : మండలంలోని రైవాడ శివారు శంభువానిపాలెంలో గిరి నాగు హల్ చేసింది. సుమారు 15 అడుగుల గిరి నాగు కనబడడంతో గ్రామస్థులు భయాందోళనలకు గురయ్యారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. మరోవైపు.. విజయనగరం జిల్లా వేపాడ మండలం కొప్పలవానిపాలేనికి చెందిన స్నేక్ క్యాచర్ కృష్ణకు సమాచారం ఇవ్వడంతో ఆయన వచ్చి గంటల తరబడి శ్రమించి పట్టుకోగలిగారు. ఆ పామును దట్టమైన అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. కాగా, ఈ ప్రాంతంలో గిరినాగులు అడపాదడపా కనపిస్తుంటాయని కొందరు చెప్పారు.

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాల విడుదల

కొత్తూరు, సెప్టెంబరు 18: ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి ఫలితాలు బుధవారం విడుదలయ్యాయని జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వివింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీ కోర్సుల పరీక్షా ఫలితాలను విజయవాడలో ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ విడుదల చేశారని తెలిపారు. అభ్యర్థులు తమ ఫలితాలను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవాలని ఆమె తెలిపారు.

భీమిలి ఆర్డీవో భాస్కరరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు

» ప్రభుత్వ భూమికి సంబంధించి తప్పుడు నివేదిక సమర్పించారని అభియోగం

విశాఖపట్నం, సెప్టెంబరు 18 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు ప్రభుత్వం ఆదేశించింది. విశాఖ రూరల్ మండలం మధురవాడ సర్వే నంబరు 133లో 3.47 ఎకరాల ప్రభుత్వ భూమికి సంబంధించి తప్పుడు నివేదిక సమర్పించినట్టు ఆరోపణలు రావడంతో విచారణ చేపట్టారు. ఈ వ్యవహారంలో ఆయనతోపాటు మరో ముగ్గురు ఉద్యోగులపై చర్యలకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే దీనికి సంబంధించి బుధవారం జారీచేసిన జీవో ఓపెన్ కాలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పోలీస్ జాగిలాలతో తనిఖీలు


అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో పోలీసు జాగిలంతో తనిఖీ

కొత్తూరు, సెప్టెంబరు 18 : జిల్లాలో పార్శిల్ సర్వీసుల ద్వారా జరిగే మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టేందుకు పోలీసు జాగిలాలతో బుధవారం రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్‌లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించామని ఎస్పీ ఎం.దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లిలోని ఆర్టీసీ, ప్రైవేటు పార్శిల్ సర్వీసుల వద్ద జాగిలాలతో తనిఖీలు జరిపామని పేర్కొన్నారు. అలాగే, రైల్వేస్టేషన్, చెక్‌పోస్టుల వద్ద కూడా విస్తృత తనిఖీలు చేపట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి పట్టణ ఎస్‌ఐ అలీ షరీఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నంలో..


పోలీస్ జాగిలంతో ఆర్టీసీ పార్శిల్ గోదాములో తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సీపట్నం, సెప్టెంబరు 18 : మాదక ద్రవ్యాలను కనిపెట్టే పోలీసు జాగిలంతో పోలీసులు ఆర్టీసీ పార్శిల్ సర్వీసు గోదాములో తనిఖీ చేశారు. బుధవారం గంజాయి అక్రమ రవాణా నిరోధించే క్రమంలో ఎస్పీ ఆదేశాలతో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ రేవతమ్మ, ఎస్సై సుధాకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అచ్యుతాపురం, సెప్టెంబరు 18 : రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్టు సీఐ నమ్మి గణేష్ తెలిపారు. గాజువాక సమీపంలోని మల్కాపురానికి చెందిన జె.అప్పలనాయుడు (50) అచ్యుతాపురం వైపు బైక్‌పై వస్తుండగా, మడుతూరు జంక్షన్ వద్ద ప్రమాదానికి గురయ్యాడన్నారు. తీవ్ర గాయాలకు గురైన అతనిని విశాఖ కేజీహెచ్‌కు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్టు చెప్పారు.

'సింహాద్రి' మొదటి యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, సెప్టెంబరు 18: ఇక్కడి సింహాద్రి సూపర్ థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎన్టీపీసీ) లోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్‌లోని ఉత్పత్తిని బుధవారం పునరుద్ధరించారు. ఇదే యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌ల్లో రంధ్రాలు ఏర్పడడంతో గత శనివారం అర్ధరాత్రి ఉత్పత్తి అర్ధాంతరంగా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టి యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని యూనిట్‌ల్లోనూ ఉత్పత్తి పూర్తిస్థాయిలో జరుగుతుందని అధికారులు తెలిపారు.

రచయిత్రి గాయత్రీదేవికి బిరుదు ప్రదానం


గాయత్రీదేవికి మధురకవన ధుని బిరుదు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి, సెప్టెంబరు 18: ఆధ్యాత్మిక, సాహిత్య రంగాల్లో సేవలందిస్తూ, ఎన్నో రచనలు చేసిన మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన డాక్టర్ జి.గాయత్రీదేవి రచించిన శతకగాయత్రి గ్రంథావిష్కరణ హైదరాబాద్‌లో బుధవారం ఘనంగా జరిగింది. బైరామల్‌గూడ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో తొలుత ఈ గ్రంథాన్ని తెలుగు రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు ఆవిష్కరించారు. అనంతరం గాయత్రీదేవికి మధురకవన ధుని బిరుదును ప్రదానం చేసి, సత్కరించారు. ఆమె సేవలను ప్రముఖ కవులు కంది శంకరయ్య, చింతా రామకృష్ణ, గౌరీ శంకరశర్మ, తోపెల్ల బాల సుబ్రహ్మణ్యం తదితరులు ప్రశంసించారు.

బోధన పద్ధతులు మెరుగుపరుచుకోవాలి

» డీఈవో వెంకట లక్ష్మమ్మ


స్కూల్ కాంప్లెక్స్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న జిల్లా విద్యా శాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 18: టీచ్‌టూల్ అంశాలకు అనుగుణంగా బోధన పద్ధతులను ఉపాధ్యాయులు మెరుగుపరుచుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకట లక్ష్మమ్మ సూచించారు. మండలంలోని పూడిమడక హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఇంగ్లీషు సబ్జెక్టు స్కూల్ కాంప్లెక్సు ఉపాధ్యాయుల సమావేశానికి ఆమె హాజరయ్యారు. రిసోర్సు పర్సన్‌లు స్కూల్ కాంప్లెక్సులో చర్చించి నిర్ణయించిన అంశాలపై అర్థవంతమైన చర్చను నిర్వహించాలన్నారు. అనంతరం పూడిమడక పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థుల నోట్సును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పీవీ రామశేషు, రిసోర్సు పర్సన్‌లు ఎస్ఎస్ఎన్ నాగేశ్వరరావు, ఎల్‌పీవీ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'గీత కార్మికుల ఉపాధికి నూతన ఎక్సైజ్ పాలసీ రూపొందించాలి'



ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గీత కార్మికులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18: ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మికుల ఉపాధి అవకాశాలు పెంచేందుకు నూతన ఎక్సైజ్ పాలసీ రూపొందించాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర దేవుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎక్సైజ్ జిల్లా కార్యాలయం ఎదుట కల్లుగీత కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా దేవుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం సందర్భంగా గీత కార్మికులకు 20 శాతం బ్రాందీ షాపుల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత కేవలం పది శాతం మాత్రమే కేటాయిస్తామని చెప్పడం అన్యాయమన్నారు. గీత కార్పొరేషన్ ద్వారా కార్మికులు షేర్ ధనం కట్టి ఉన్నారని, మండలాల్లో బ్రాందీ షాపులు ఏర్పాటుకు 50 శాతం రాయితీ కల్పించి టెండర్ వేసే విధంగా పాలసీ రూపొందించాలని కోరారు. కూటమి ప్రభుత్వం గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

లక్కవరపుపేటలో భారీ కొండచిలువ హతం


గిరిజనులు హతమార్చిన భారీ కొండ చిలువ

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 18: మండలంలోని లక్కవరపుపేట గ్రామ శివారులో భారీ కొండ చిలువను స్థానికులు హతమార్చారు. బుధవారం మధ్యాహ్నం పొలం పనుల్లో నిమగ్నమైన గిరిజనులకు అతి సమీపంలోకి కొండచిలువ వచ్చింది. దీంతో వారు పనులు ఆపేసి భయంతో పరుగులు పెట్టారు. అయితే కొండ చిలువ గ్రామంలోకి వస్తే కోళ్లు, మేకలను మింగేస్తుందని, చిన్నపిల్లలకు కూడా హాని కలుగుతుందన్న భయంతో కొంతమంది యువకులు కర్రలతో కొట్టి కొండచిలువను చంపేశారు.

ఘనంగా వినాయక ఉత్సవాలు



గణనాథునికి పూజలు చేసి, అన్నసమారాధనను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ దీపికా

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 : జిల్లా పోలీస్ కార్యాలయంలో వినాయక నవరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బుధవారం నిమజ్జనోత్సవాన్ని జరిపారు. తొలుత గణనాథునికి జిల్లా జిల్లా ఎస్పీ ఎం.దీపికా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటైన అన్నసమారాధనను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహన్‌రావు, కార్యాలయం ఏవో బి.శారదా, కమ్యూనికేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట చిట్టి, ఎస్‌బీ, డీసీఆర్‌బీ, పోలీస్ కంట్రోల్ రూమ్, ఐటీ కోర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొప్పుగొండుపాలెంలో స్వామివారికి లక్ష గరిక పూజ

రాంబిల్లి: వినాయక ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కొప్పుగొండుపాలెంలో ఏర్పాటు చేసిన మండపంలో బుధవారం లక్ష గరిక పూజను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లా పురోహిత సమాఖ్య అధ్యక్షులు పెద్దింటి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో అర్చక బృందం శాస్త్రోక్తంగా ఈ వేడుకను జరిపించారు. గ్రామ పెద్దలు పప్పల నూకన్నదొర, బద్ది రమణ, పప్పల బాబూరావు, బద్ది ఈశ్వరరావులతో పాటు పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్ : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఇందులో భాగంగా బుధవారం కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, అధ్యాపకులు, విద్యార్థులు స్వామివారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకు వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలతో కోలాహల వాతావరణం నెలకొంది.

సబ్బవరం : మండలంలోని మొగలిపురం, అసకపల్లి, సబ్బవరం తదితర గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద బుధవారం పెద్ద ఎత్తున అన్నసమారాధనలు జరిపారు. సబ్బవరం దుర్గానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన గణపతిని తొలుత మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. నాయకులు కర్రి బాబు, గండి రవికుమార్, సర్పంచ్ దెడ్డం ప్రసాద్, ఎర్రంశెట్టి రాము, బోకం రామునాయుడు, కొటాన రాము, నారాయణమూర్తి, సురేశ్‌రాజ్, కాపుశెట్టి శేషు, వడ్డాది అప్పలరాజు, రాజుబాబు, మండల లక్ష్మణ, ధనించెడ్డి శ్రీను తదితరులు పాల్గొన్నారు.



అనుపోత్సవంలో రత్నాకర్



సబ్బవరంలో వినాయకుడ్ని దర్శించుకుంటున్న అదీప్

వాడబలిజ సామాజికవర్గ సమస్యలపై చర్చ



సమావేశంలో సమస్యలపై చర్చిస్తున్న సంఘం నాయకులు

రాంబిల్లి, సెప్టెంబరు 18 : వాడబలిజ సంక్షేమ సంఘ సమావేశాన్ని బుధవారం ఇక్కడ నిర్వహించారు. వాడనర్సాపురం మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండలంలోని పలు మత్స్యకార గ్రామాలకు చెందిన వాడబలిజ సంఘం సభ్యులు హాజరయ్యారు. ఆ సామాజికవర్గంలోని వారి సమస్యలతో పాటు మత్స్యకార గ్రామాల్లో సమస్యలపై చర్చించి, పలు తీర్మానం చేశారు. సంఘం నాయకులు వాడనర్సాపురం సర్పంచ్ కారే రామారావు, చోడిపల్లి సత్యనారాయణ, ఎరిపిల్లి చిట్టిబాబు, చెల్లూరి నూకరాజు, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు కొవిరి రామకృష్ణ, మాజీ ఎంపీటీసీ చెల్లూరి దేముడు, సిహెచ్.నూకరాజు, కొవిరి సోమేష్, గరికిన అప్పారావు, కొండబాబు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేవుట్‌లు!

... 5వ పేజీ తరువాయి

లే-అవుట్ వేశారు. దీనికి ఇంతవరకు అనుమతులు తీసుకోలేదు. కనీసం "నాలా" పన్ను కూడా చెల్లించలేదు. అంతేకాక లేఅవుట్‌కు ఇరువైపులా సర్వే నంబర్లు 233, 255, 259లలో వున్న గెడ్డ వాగును పూడ్చేసి లేఅవుట్లో కలిపేసుకున్నారు. దీనిపై గతంలో గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు కనీసం విచారణ కూడా జరపలేదు. అక్రమ లేఅవుట్‌లు వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు ఏ విధంగా కొమ్ము కాస్తున్నారో ఇది ఒక ఉదాహరణ అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి అక్రమంగా వెలుస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

విద్యా శాఖలో కలకలం!

... 5వ పేజీ తరువాయి

అక్కడే మాటు వేసివున్న ఏసీబీ డీఎస్పీలు నాగేశ్వరరావు, రమ్యలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం విద్యా శాఖ కార్యాలయంలో సాయంత్రం వరకు సోదాలు నిర్వహించి, పలు రికార్డులను పరిశీలించారు. ఓపెన్ స్కూల్స్ పరీక్షా కేంద్రాల నిర్వహణకు గతంలో ఎన్ని విద్యా సంస్థలకు అనుమతులు ఇచ్చారు? ఆయా యాజమాన్యాల నుంచి తీసుకుంటున్న లంచం సొమ్ములో ఎవరెవరికి ఎంతెంత వాటాలు వెళుతున్నాయి? లేకపోతే లంచం వసూళ్లకు కోఆర్డినేటర్ ఒక్కడే బాధ్యుడా అన్న కోణాల్లో ఏసీబీ అధికారులు డీఈవో ఎంవీ లక్ష్మమ్మ, డిప్యూటీ డీఈఓ అప్పారావు, సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులను విచారించి, సమాచారం సేకరించినట్టు తెలిసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన కుమార్‌ను ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

ఇళ్ల నిర్మాణాల పెండింగ్ బిల్లులపై సర్వే

▸▸ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన గృహాల లబ్ధిదారులను కలిసి వివరాలు సేకరిస్తున్న అధికారులు



ఇంటింటా సర్వే చేస్తున్న గృహ నిర్మాణశాఖ అధికారులు, టీడీపీ నాయకులు

నక్కపల్లి, సెప్టెంబరు 18 : మండలంలో 2014 నుంచి 2019 వరకూ అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో మంజూరైన ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారుల పెండింగ్ బిల్లులపై ఇంటింట సర్వేను గృహ నిర్మాణశాఖ ప్రారంభించింది. ఇందులో భాగంగా బుధవారం ఉపమాక గ్రామంలో హౌసింగ్ ఏఈ జగన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నాయుడు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు కొప్పిశెట్టి జగదీశ్వరరావు ఇంటింటికీ వెళ్లి, ఆయా లబ్ధిదారులను కలిసి పెండింగ్ బిల్లులపై సర్వే ప్రారంభించారు. ఈ వివరాలతో నివేదికను హోం మంత్రి అనితకు అందజేస్తామని కొప్పిశెట్టి బుజ్జి చెప్పారు. ఉపమాక గ్రామంలో 97 మంది లబ్ధిదారులు ఉన్నారని, మండల వ్యాప్తంగా 922 మంది ఉన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోలేటి శ్రీను, కె.శ్రీను తదితరులలు పాల్గొన్నారు.



డి.అగ్రహారం పాఠశాలలో కిచెన్ గార్డెన్ పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో

పాఠశాలలను సందర్శించిన అధికారులు

మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించిన డిప్యూటీ డీఈవో

నక్కపల్లి, సెప్టెంబరు 18 : వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వండి పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు, ఎంఈవోలు కె.నరేశ్, వేమగిరి నూకరాజు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచి చూశారు. అంతకుముందు వేంపాడు, చినదొడ్డిగల్లు హైస్కూళ్లలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను డిప్యూటీ డీఈవో పరిశీలించి పలు సూచనలు చేశారు.

ధర్మవరం అగ్రహారంలో...

ఎస్.రాయవరం : ధర్మవరం అగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల కిచెన్ గార్డెన్‌ను డిప్యూటీ డీఈవో పి.అప్పారావు బుధవారం సందర్శించారు. ఇక్కడి పాఠశాలలో పండే కూరగాయలను విద్యార్థులకు వండి పెడుతున్నట్టు హెచ్‌ఎం బి.శ్రీను తెలపడంతో ఆయనతో పాటు ఉపాధ్యాయులను అభినందించారు.

చెకుముకి ప్రతిభా పరీక్షల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు, ఉపాధ్యాయులు

అచ్యుతాపురం రూరల్, సెప్టెంబరు 18 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న చెకుముకి ప్రతిభా పరీక్షలకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం హరిపాలెంలో ఎంఈవో సీఆర్‌కే దేవరాయలు ఆవిష్కరించారు. ఈ నెల 25న పాఠశాల స్థాయిలో ప్రతిభా పరీక్ష నిర్వహించనున్నారు. అక్టోబరు ఒకటి మండల స్థాయి, 27న జిల్లా స్థాయి, నవంబరు 9, 10 తేదీలలో రాష్ట్ర స్థాయిలో ఈ ప్రతిభా పరీక్షలు ఉంటాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్‌పర్సన్ శ్రీపాద రవి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు మద్దెల నానాజీ, జీఎస్ ప్రకాష్, రవికుమార్, సలీం, గుప్తా, నక్కా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపునకు 39 మంది హాజరు



దివ్యాంగులతో మాట్లాడుతున్న వైద్యులు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 : ఇక్కడి ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం సదరం క్యాంపు నిర్వహించారు. నర్సీపట్నం, పాయకరావుపేట మండలాల నుంచి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పరిశీలనకు 39మంది దివ్యాంగులు హాజరయ్యారని ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. వీరిలో 35మందిని గుర్తించామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును పునఃసమీక్షించాలి'



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న సమితి ప్రతినిధులు

కశింకోట, సెప్టెంబరు 18 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం ఇక్కడ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి సింహాద్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్గీకరణ రాజ్యాంగ బద్ధంగా జరగలేదన్నారు. ఎస్సీల్లో కోల్పోతున్న హక్కుల కోసం జిల్లా స్థాయిలో పోరా టం చేసేందుకు అంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. సమితి మండల అధ్యక్షుడు వంకర రాజు, ప్రతినిధులు వెంకటరావు, బోని గణేష్, దొమ్మేటి సత్యారావు, షైలపల్లి పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

రూ.82 వేలు పలికిన వినాయక లడ్డూ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 18 : మండలంలోని అడ్డురోడ్డు తిమ్మాపురంలో ఎస్‌బీఐ బ్రాంచ్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో స్వామివారికి ప్రసాదంగా ఉంచిన లడ్డూను బుధవారం రాత్రి వేలం వేశారు. పలువురు ఈ పాటలో పోటీపడ్డారు. చివరకు 27 కిలోల బరువుండే లడ్డూ ప్రసాదాన్ని ఇక్కడి ఆటో యూనియన్ అధ్యక్షులు గుర్రం సత్యనారాయణ రూ.80 వేలకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వంగలపూడి గోవింద్, గుర్రం రామకృష్ణ, కర్రి చందు, సేనాపతి బాబూరావుతో పాటు కమిటీ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

ఏపీవోగా ఎరకయ్య బాధ్యతల స్వీకరణ

ఎస్.రాయవరం, సెప్టెంబరు 18 : ఎన్‌ఆర్‌జీఎస్ మండల ఏపీవోగా డీవీ ఎరకయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మునగపాక మండలం నుంచి బదిలీపై ఇక్కడికి విచ్చేశారు. అలాగే ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌గా ఇ.సంధ్యాకుమారి కూడా బాధ్యతలు చేపట్టారు. అనంతరం వీరు ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ మర్యాదపూర్వకరంగా కలిశారు.

'విశాఖ డెయిరీ కార్యదర్శులు, సిబ్బందిపై నిర్లక్ష్యం తగదు'

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 : విశాఖ డెయిరీ సంపద సృష్టికర్తలైన పాడి రైతులను, పాల సేకరణ చేసే కార్యదర్శులను, సిబ్బందిని నిర్లక్ష్యం చేయడం తగదని విశాఖ డెయిరీ సహకార సంఘాల ఉత్పత్తిదారులు, కార్యదర్శుల వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పెంటకోట సత్యనారాయణ అన్నారు. బుధవారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా డెయిరీలో పనిచేసే తమకు ఐదేళ్లుగా వేతనాలు పెంచకపోవడం అన్యాయమన్నారు. యాజమాన్యానికి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా స్పందించలేదని వాపోయారు. గత్యంతరం లేక ఉద్యమ బాట పట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఉద్యమ కార్యచరణ అమలులో భాగంగా ఈ నెల 20వ తేదీన నూకాంబిక ఆలయం రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న కార్యవర్గ సమావేశానికి సభ్యులంతా హాజరుకావాల్సిందిగా అయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జి.కనకారావు, కరక సోమునాయుడు, దొడ్డి సూర్యారావు, కరెడ్ల దేముడు, గళ్లా ఎరుకు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల నిర్వహణపై సమీక్ష

ఎస్.రాయవరం, సెప్టెంబరు 18 : అండర్-14, 17 బాలుర ఆటల పోటీల నిర్వహణపై కొరుప్రోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈనెల 20, 21 తేదీల్లో ఈ పోటీలను నిర్వహించేందుకు డిప్యూటీ డీఈవో అప్పారావు, ఎంఈవో సత్తిబాబు, పాఠశాల హెచ్‌ఎం సత్యనారాయణ నిర్ణయం తీసుకున్నట్టు మండల కో-ఆర్డినేటర్ కె.శ్రీను తెలిపారు. పూర్తివివరాలకు 94941 52090, 99597 85202 నంబర్లలో సంప్రదించాల్సిందిగా కోరారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

▸▸ ఏళ్ల తరబడి ఇదే దుస్థితి ఉన్నా పట్టకపోవడం తగదని ఆగ్రహం



రాస్తారోకో నిర్వహిస్తున్న వర్తక సంఘం, సీఐటీయూ నాయకులు

పరవాడ, సెప్టెంబరు 18 : మండలంలో దెబ్బతిన్న రహదారులకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ పరవాడ వర్తక సంఘం, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సినిమాహాల్ జంక్షన్ వద్ద ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వర్తకసంఘం ప్రతినిధి గండి శ్రీనివాసరావు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పరవాడ నుంచి ఎలమంచిలి వెళ్లే ప్రధాన రహదారి శిథిలం కావడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆర్ అండ్‌బీ అధికారుల దృష్టికి పలుమార్లు ఈ విషయాన్ని తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ రహదారి గుండా ఎన్టీపీసీ, ఫార్మాసిటీ, ఎస్‌ఈజెడ్‌కు వెళ్లే వాహనాల సంఖ్య అధిక సంఖ్యలో ఉంటాయన్నారు. ఇంత రద్దీగా ఉన్నా రహదారిపై దీర్ఘకాలంగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. తక్షణమే రహదారికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.గోపి, బండారు అప్పారావు, సీహెచ్. సన్యాసిరావు, జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దుర్గాభవానీ దీక్షలు ప్రారంభం



భవానీ అర్ధమండల దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

నక్కపల్లి, సెప్టెంబరు 18 : వచ్చే నెల మూడవ తేదీ నుంచి జరగనున్న శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని నక్కపల్లి మండలంలోని అనేక గ్రామాలకు చెందిన భక్తులు దుర్గాభవానీ అర్ధమండల దీక్షలను ప్రారంభించారు. గొడిచెర్ల, ఉపమాక గ్రామాల్లోని శివాలయాల్లో అర్చకులు తొలుత గోత్రనామాలతో పూజలు నిర్వహించగా, గురుభవానీలు భక్తులతో మాలాధారణ చేయించారు. ఈ నెల 19వ తేదీ గురువారం నాడు పెద్ద సంఖ్యలో దీక్షలు చేపట్టనున్నారని గురుభవానీలు తెలిపారు.

ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు శంకుస్థాపన

కొత్తూరు, సెప్టెంబరు 18 : సంపతిపురం పంచాయతీలో ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు బుధవారం సర్పంచ్ నంబారు నాగమణి శంకుస్థాపన చేశారు. ఎంపీ సీఎం రమేష్, ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు తమ్మయ్యపేటలో జల్ జీవన్ మిషన్ పథకం పథకం కింద ప్రతి ఇంటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు నంబారు శ్రీను, ఎంపీటీసీ కడిమి గణేశా, కూటమి నాయకులుపాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో డీవీఎన్ విద్యార్థులకు పతకాలు



చరణ్, నాగరాజు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 18 : అమలాపురంలో జరిగిన రాష్ట్ర 11వ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్‌ప్రెస్ పోటీల్లో ఇక్కడి దాడి వీరు నాయుడు కళాశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించారు. 83కిలోల విభాగంలో ఎస్.బాలాజీ చరణ్ బంగారం, వెండి పతకాలతో పాటు స్టేట్ స్ట్రాంగ్‌మెన్ పోటీల్లో ద్వితీయ స్థానం దక్కించుకున్నాడని కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. 59 కిలోల విభాగంలో జి.నాగరాజు బంగారు పతకాన్ని సాధించాడన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్‌తో పాటు అధ్యాపక సిబ్బంది విజేతలను అభినందించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



కొబ్బరి మొక్క నాటుతున్న వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి

సబ్బవరం, సెప్టెంబరు 18 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వైస్ ఎంపీపీ ఝాన్సీ లక్ష్మీరాణి పిలుపునిచ్చారు. మండలంలోని ఆరిపాక శివారు లగిశెట్టిపాలెంలో ఉపాధి పథకంలో భాగంగా పంపిణీ చేసిన కొబ్బరి మొక్కలను బుధవారం ఆమె నాటి మాట్లాడారు. స్థానిక నాయకులు పాలిశెట్టి సురేశ్‌రాజ్, శరగడం రాము, రమేశ్‌రాజ్, అండిబోయిన బంగారయ్య ఫల్గుణ, బీఎం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు నేవీ రోడ్డులో గుంతలు పూడ్చివేత

రాంబిల్లి, సెప్టెంబరు 18 : ఇక్కడి నేవీ రోడ్డులో ఏర్పడిన గుంతలను ఎట్టకేలకు పూడ్చారు. రాంబిల్లి జంక్షన్, అప్పన్నపాలెం కాలనీ జంక్షన్‌ల వద్ద రోడ్డుపై ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గుంతలు పడడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. పలువురు ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురై ఆస్పత్రుల్లో చికిత్సలు పొందిన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు సమస్య మరింత తీవ్రంగా మారింది. దీంతో నేవీలోని ఐటీడీ కంపెనీ ఆధ్వర్యంలో జీఎస్‌పీ మెటీరియల్ తీసువచ్చి రోడ్డు మధ్యల్లో ఏర్పడిన రంధ్రాలను పూడ్చి రోలింగ్ చేశారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ సన్యాసిరాజు

పరవాడ, సెప్టెంబరు 18 : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జడ్పీటీసీ పైలా సన్యాసిరాజు పిలుపునిచ్చారు. వాడచీపురుపల్లి హైస్కూల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మండలస్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మండల స్థాయిలో రాణించిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంఈవోలు దివాకర్‌రావు, సాయిశైలజా, వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, సర్పంచ్ శివలంక లక్ష్మి, వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు, హెచ్‌ఎం పందిరి కనకేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎంజీ నాగేశ్వరరావు, వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ అందరి లక్ష్యం కావాలి

సబ్బవరం, సెప్టెంబరు 18 : వికసిత్ భారత్, వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధనలో భాగంగా ఐదేళ్ల కార్యాచరణపై వివిధ శాఖల అధికారులకు బుధవారం ఇక్కడ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రమేశ్‌నాయుడు మాట్లాడుతూ 2047 నాటికి అభివృద్ధి చెందిన మూడు దేశాల్లో ఒకటిగా భారతదేశం ఉండేలా ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. పశువైద్య శాఖ ఏడీ డాక్టర్ ఉషాకుమారి, డీఎస్‌వో శశికళ, ఏఎస్‌వో శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'జర్నలిస్టులు సమన్వయంతో పనిచేయాలి'

కశింకోట, సెప్టెంబర్ 18 : జర్నలిస్టులంతా సమన్వయంతో పనిచేసి హక్కులను సాధించుకోవాలని ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంటకోట జోగినాయుడు, కోరాడ చంద్రరావు పిలుపునిచ్చారు. బుధవారం ఇక్కడ జరిగిన అనకాపల్లి నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. అనంతరం అనకాపల్లి ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మళ్ల భాస్కరరావు, ప్రధాన కార్యదర్శిగా బీమరశెట్టి గణేష్, కోశాధికారిగా నంబారు సత్యారావు, ఉపాధ్యక్షుడిగా వెలగా జగదీష్, సహాయ కార్యదర్శిగా పావాడ సన్యాసిరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వేగి రామచంద్రరావులతో పాటు పలువుర్ని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మద్దాల రాంబాబు, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆళ్ల వెంకటఅప్పారావులతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

'ఫార్మా'ల్లో కార్మికులకు పటిష్ట భద్రత కల్పించాలి



అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

రాంబిల్లి, సెప్టెంబరు 18 : సెజ్‌లోని ఫార్మా కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన భద్రత కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజయ్‌శర్మ డిమాండ్ చేశారు. కార్మికుల భద్రత కోరుతూ సీపీఎం ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న రక్షణ యాత్ర బుధవారం రాంబిల్లి, గోవిందపాలెం, నేవీగేట్, వాడనర్సాపురం, కొత్తపట్నం, వెంకయ్యపాలెం, గజిరెడ్డిపాలెం, లోవపాలెం, లాలంకోడూరు మీదుగా సాగింది. ఆ పార్టీ మండల కన్వీనర్ జి.దేముడునాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల్లో నాయకులు మాట్లాడారు. కర్మాగారాల్లో సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే కార్మికులు ప్రాణాలను కోల్పోతున్నారన్నారు. ఇప్పటికైనా ఆయా యాజమాన్యాలు స్పందించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నాయకురాలు ప్రభావతి, శంకర్రావు, శ్రీరామ్, అప్పలరాజు, మాణిక్యం, నారాయణరావు, రాము, నూకన్న, అరుణ,కాశియ్య, అప్పలరాజు, ప్రజా సంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

అచ్యుతాపురం : పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల భద్రతకు సీపీఎం తలపెట్టిన రక్షణ యాత్ర బుధవారం పూడిమడక చేరుకుంది. ఈ సందర్భంగా తీరంలో సదరు నాయకులు మాట్లాడుతూ సెజ్‌తో పాటు ఫార్మా కర్మాగారాల్లో పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాల్సిందిగా డిమాండ్ చేశారు. పునరావాస కాలనీలో రాత్రికి బస చేశారు. నాయకులు రొంగలి రాము, కూండ్రపు సోమునాయుడు, చేపల తాత పాల్గొన్నారు.

ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ రమాదేవి కన్నుమూత



రమాదేవి (ఫైల్)

కొత్తూరు, సెప్టెంబరు 18 : ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ అలా రమాదేవి (60) బుధవారం అనకాపల్లిలోని పూడిమడక రోడ్డు సమీపంలో ఉన్న తమ స్వగృహంలో మృతి చెందారు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు దశాబ్దాల పాటు గర్భిణులకు ప్రత్యేక వైద్య సేవలందించడంతో పాటు జనరల్ వైద్యం కూడా చేసేవారు. ఆమె ఇద్దరి కుమార్తెలు గుంటూరులో వైద్యులుగా పనిచేస్తున్నారు. భర్త కూడా వైద్య వృత్తిలోనే ఉంటూ అనకాపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో సేవలందిస్తున్నారు. రమాదేవి మృతికి పలువురు సంతాపం తెలిపారు. ఆమె భౌతికకాయం వద్ద ఆర్‌ఈసీఎస్ మాజీ చైర్మన్ రాఘవరావు, కొల్లి శ్రీను తదితరులు నివాళులర్పించారు.

రంగస్థల నటుడు, థియేటర్ యజమాని రామప్పారావు మృతి



రామప్పారావు (ఫైల్ ఫొటో)

అచ్యుతాపురం, సెప్టెంబరు 18 : బహుముఖ ప్రజ్ఞాశాలి మండలంలోని హరిపాలేనికి చెందిన శరగడం రామప్పారావు (74) బుధవారం మృతిచెందారు. రంగస్థల నటుడైన ఈయన గ్రామీణ ప్రాంత ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చేందుకు ఎన్నెన్నో చక్కని సాంఘిక నాటికలను ప్రదర్శించేవారు. కొన్ని నాటకాలకు దర్శకత్వం వహించేవారు. అలాగే హరిపాలెంలో ఉన్న సన్యాసాంబ సినిమా థియేటర్ యజమాని కూడా. 1968 నుంచి కాంగ్రెస్ నాయకుడి గుర్తింపు పొందారు. సీనియర్ నేతలతో పరిచయాలు ఉన్నాయి. ఈయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

27న మెగా రక్తదాన శిబిరం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, లెక్చరర్లు

చోడవరం, సెప్టెంబరు 18 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈ నెల 27న మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్టు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ తెలిపారు. విశ్వనాథ్ టైప్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బుధవారం కళాశాలలో రక్తదాన శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ దివస్

కాలేజీలో బుధవారం హిందీ విభాగం ఆధ్వర్యంలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందీ విభాగం హెచ్‌వోడీ డాక్టర్ సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల ఉత్పత్తిపై శిక్షణ


రైతులకు సూచనలిస్తున్న తులసీమణి

కె.కోటపాడు, సెప్టెంబరు 18 : గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా రైతులు తమకు కావాల్సిన విత్తన రకాలను తమ గ్రామంలోనే ఉత్పత్తి చేసుకుని ఉపయోగించుకోవచ్చని జిల్లా వనరుల కేంద్రం అనకాపల్లి వ్యవసాయాధికారి తులసీమణి రైతులకు సూచించారు. బుధవారం ఆర్‌వై అగ్రహారం గ్రామంలో 'ఆత్మ' సౌజన్యంతో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. 2024 గాను ఎంటీయూ 1121 వరి రకంను విత్తన ఉత్పత్తి చేసుకునే విధంగా రైతులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో సోమశేఖర్, రైతులు మండ శ్రీనివాసరావు, యడ్ల బలరాం, ఏఈవో సాయివాణి, వీఏఏ కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థుల అవసరాలను గుర్తెరిగి బోధించాలి

▸▸ మండల విద్యాశాఖ అధికారి పీఎస్ఎన్ మూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో మూర్తి

మాకవరపాలెం, సెప్టెంబరు 18 : విద్యార్థుల అవసరాలకు తగినట్టుగా బోధించాలని మండల విద్యాశాఖ అధికారి పీఎస్ఎన్ మూర్తి అన్నారు. బుధవారం గిడుతూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలకు స్కూల్ కాంప్లెక్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలకు అనుగుణంగా బోధన చేయాలన్నారు. అలాగే విద్యార్థి స్థాయి గ్రహించి బోధించాలని, అప్పుడే బోధనలో మనం సంపూర్ణంగా సఫలీకృతులం అవుతామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిసోర్స్ పర్సన్ కోనూరు రాము, కె.బాలాజీ, వరహ గణేష్ పాల్గొన్నారు.

క్రీడల పోటీలకు పతకాల అందజేత


ఎంఈవో-2 నాగేంద్రకు మెడల్స్ అందజేస్తున్న రాజేశ్

నర్సీపట్నం, సెప్టెంబరు 18 : ఈ నెల 25, 26 తేదీల్లో నిర్వహించే నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు అందించనున్న గోల్డ్, సిల్వర్ మెడల్స్‌ని సిద్ధం చేసి చింతకాయల రాజేశ్ ఎంఈవో-2 నాగేంద్రకు అందజేశారు. క్రీడా పోటీల్లో విజేతలకు మెడల్స్, అల్పాహారం స్పాన్సర్ చేస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజేతలకు ప్రదానం చేసే మెడల్స్‌ను రాజేశ్ సమకూర్చి విద్యా శాఖ అధికారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ క్రీడల కో-ఆర్డినేటర్ శ్రీనివాసుల నాయుడు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంఈవో-2గా మూర్తి



గొలుగొండ, సెప్టెంబరు 18 : మండలంలోని ఇన్‌చార్జి ఎంఈవో-2గా ఏపీఎస్ మూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకూ ఒ.సత్యనారాయణ ఎంఈవో-1గా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఎంఈవో-2గా మూర్తిని ప్రభుత్వం నియమించింది.

కోతుల బెడద నుంచి కాపాడండి

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ధర్నా

నర్సీపట్నం, సెప్టెంబరు 18 : కోతుల బెడద నుంచి రైతాంగాన్ని కాపాడాలని ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక, రైతు సంఘాలతో కలిసి రైతులు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం ఖర్చుతో కూడుకున్నదని, ఫలసాయం అందుబాటులోకి వచ్చే సమయంలో కోతులు ఆ పంటలను ధ్వంసం చేస్తున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోతులు, ఇతర వణ్య ప్రాణుల దాడిలో మరణించిన రైతులు, పంటకు నష్ట పరిహారం పెంచాలని కోరారు. వానరాల బెడద నుంచి రైతులను కాపాడాలని డిమాండ్ చేశారు. అటవీ బంజరు భూములు సాగు చేసుకుంటున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డిపల్లి అప్పలరాజు, మేకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన వ్యవసాయ కార్మిక, రైతు సంఘాల ప్రతినిధులు

బాల్య వివాహాలు చేస్తే చర్యలు తప్పవు



కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కలిగిస్తున్న చైల్డ్ లైన్ ప్రతినిధి కనకమహాలక్ష్మి

మాడుగుల రూరల్, సెప్టెంబరు 18 : ఆడ పిల్లలకు 18 ఏళ్ల నిండకుండా వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని చైల్డ్ లైన్ ప్రతినిధి కనక మహాలక్ష్మి స్పష్టం చేశారు. బుధవారం డి.సురవరం కేజీబీవీలో విద్యార్థినులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు చదువుతో పాటు చట్టాలపై కూడా అవగాహనకలిగి ఉండడం అవసరం అన్నారు. బాలలకు ఏవైనా ఇబ్బందులు ఎదురైతే హెల్ప్ లైన్ నంబరు 1098కు కాల్ చేయాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనంతరం డి.సురవరం, సాగరం, గొటివాడ గ్రామాల్లో కూడా బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, కేజీబీవీ ఎస్‌వో విజయ, మహిళా పోలీస్ ఎర్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అవగాహన ర్యాలీలు


మాకవరపాలెం : పారిశుధ్య కార్మికులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


నాతవరం : గొలుగొండపేటలో చీపురుపట్టి రోడ్లు ఊడుస్తున్న సర్పంచ్ వెంకటరమణ

మాకవరపాలెం, సెప్టెంబరు 18 : స్వచ్ఛత పాటించడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. బుధవారం బూరుగుపాలెం, జివెంకటాపురం, తూటిపాల, తాడపాల తదితర గ్రామాల్లో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం ర్యాలీలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బూరుగుపాలెం సర్పంచ్ వి.రమణ, పంచాయతీ కార్య దర్శి నాగరాజు పాల్గొన్నారు.

నాతవరం : మండలంలోని గొలుగొండపేటలో బుధవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ మిరపల వెంకటరమణ స్వయంగా స్వీపర్లతో కలసిచీపురుతో రోడ్లను ఊడ్చి శుభ్రం చేశారు. ప్రజలు ఎప్పుడూ పరిసరాలను శుభ్రం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీడిపండ్ల రసం యూనిట్లతో రైతులకు ఆదాయం

గొలుగొండ, సెప్టెంబరు 18 : జీడిమామిడి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేందుకు వచ్చే సీజన్‌కు జీడిపండ్ల రసం యూనిట్లు ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు గందం ఆగ్రో సీఈవో సునీత తెలిపారు. మండలంలోని బుధవారం పప్పుశెట్టిపాలెం గ్రామపంచాయతీ శివారు నాగందొరపాలెంలో జీడిమామిడి ఉత్పత్తి సంఘ రైతులతో ఏర్పాటైన సమావేశంలో ఆమె మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో పండిస్తున్న జీడిపండ్లను సేకరించి వాటిని రసంగా తయారు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. దీంతో రైతులకు జీడి పండ్ల ద్వారా కూడా ఆదాయం సమకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు ఎం.వరహాలబాబు, ఎన్జీవో ప్రతినిధి ప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సునీత

ఎస్ఐ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకారం


ఎస్ఐ శ్రీనివాసరావును అభినందిస్తున్న నేతలు

బుచ్చెయ్యపేట, సెప్టెంబరు 18 : బుచ్చెయ్యపేట ఎస్ఐగా జి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న డి.ఈశ్వరరావును అనకాపల్లి స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కాగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐని జడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, తూర్పుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శిరిగిరిశెట్టి నానాజీ, మాజీ సర్పంచ్ దొండా అచ్చెయ్యదొర, చొప్పా త్రినాధ్‌రావు తదితరులు శాలువ కప్పి అభినందించారు.

చీడికాడ : చీడికాడ ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బి.సతీష్‌ను బుధవారం ఖండివరం, దండిసురవరం గ్రామ ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎస్ఐను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, టీడీపీ నాయకులు ఎస్వీఎస్ నాయుడు, బండారు దయాకర్, బొబ్బాది తాతారావు, వేపాడ నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

'బెల్ట్'తో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 18 : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట, పాతకృష్ణాదేవిపేట, సీహెచ్ నాగాపురం, కొంగసింగి, లింగంపేట, చోద్యం, విప్పలపాలెం తదితర గ్రామాల్లో జోరుగా బెల్టుషాపులు సాగుతున్నాయి. పోలీసు, ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవటంతో అదుపు లేని పరిస్థితి నెలకొంది. దీంతో ఎక్కడ పడితే అక్కడ మద్యం విరివిగా లభ్యం కావడంతో మందుబాబులు తెగ రెచ్చిపోతున్నారు. పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మద్యం తాగుతున్నారు. బహిరంగ ప్రాంతాల్లోనే మద్యం తాగుతూ విచ్చలవిడిగా ప్రవర్తిస్తున్నారు. దీంతో మహిళలు, విద్యార్థులు, వృద్ధులు వంటి వారు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత పోలీసు అధికారులు స్పందించి బెల్ట్‌షాపులను నియంత్రించాలని పలువురు కోరుతున్నారు.

తుప్పల తొలగింపు


సర్పానది వంతెన వద్ద తుప్పలు తొలగిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, సెప్టెంబరు 18 : మండలంలో పలు వంతెనల వద్ద పెరిగిన తుప్పలను జంగిల్ క్లియరెన్స్ చేపట్టి తొలగిస్తున్నట్టు ఎస్ఐ దామోదార్‌నాయుడు తెలిపారు. బుధవారం సర్పానది వద్ద రోడ్డుకు ఇరువైపులా తుప్పలను తొలిగించారు. అలాగే చంద్రయ్యపాలెం, రామన్నపాలెం, పైడిపాల సెంటర్ తదితర ప్రాంతాల్లో తుప్పలు తొలగించనున్నట్టు చెప్పారు. అలాగే రోడ్డు మలుపులు ఉన్న చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

మొబైల్‌తో బీజేపీ సభ్యత్వ నమోదు


గుడ్డిపలో యువకులతో మొబైల్‌లో సభ్యత్వ చేయిస్తున్న గల్లా

రావికమతం : మొబైల్ ద్వారా బీజేపీ సాధారణ సభ్యత్వంలో యువత చేరాలని ఆ పార్టీ స్టేట్ కౌన్సిలర్ గల్లా రాజేశ్వరావు కోరారు. బుధవారం గుడ్డిప గ్రామంలో మొబైల్ ద్వారా బీజేపీ సాధారణ సభ్యత్వ నమోదును చేయించారు. అనంతరం గ్రామంలో చెత్త ఊడ్చారు. ఈ కార్యక్రమంలో యువకులు, పంచాయతీ కార్యదర్శి ఎం.సత్తిబాబు, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

సరియా జలపాతానికి పర్యాటకులను అనుమతించొద్దు

▸▸ సీపీఎం నాయకుడు డి.వెంకన్న

దేవరాపల్లి, సెప్టెంబరు 18 : వాలాబు సమీపంలో ఉన్న సరియా జలపాతానికి పర్యాటకులు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.వెంకన్న బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ జలపాతం వద్ద ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో సుమారు 40 మంది వరకు మృతి చెంది తల్లిదండ్రులకు గర్భశోకం మిగిల్చారని, ఇంత మంది మృత్యువాత పడిన నేపథ్యంలో జలపాతం సందర్శనకు పర్యాటకులను అనుమతించకోవడమే శ్రేయస్కరమని పేర్కొన్నారు. అంతేకాకుండా అక్కడ అసాంఘిక కార్యకలాపాలు కూడా జరుగుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయన్నారు. దీంతో అక్కడకు వెళుతున్న వారికి రక్షణ లేకుండా పోయిందన్నారు. అందుకే సరియా జలపాతం సందర్శనను కొన్నాళ్లపాటు నిలిపివేసి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.

అక్రమ లేవుట్‌లు!


సబ్బవరంలో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్

... 5వ పేజీ తరువాయి

లే-అవుట్ వేశారు. దీనికి ఇంతవరకు అనుమతులు తీసుకోలేదు. కనీసం "నాలా' పన్ను కూడా చెల్లించలేదు. అంతేకాక లేఅవుట్‌కు ఇరువైపులా సర్వే నంబర్లు 233, 255, 259లలో వున్న గెడ్డ వాగును హుద్వేసి లేఅవుట్లో కలిపేసుకున్నారు. దీనిపై గతంలో గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు కనీసం విచారణ కూడా జరపలేదు. అక్రమ లేఅవుట్‌లు వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అధికారులు ఏ విధంగా కొమ్ము కాస్తున్నారో ఇది ఒక ఉదాహరణ అని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లాస్థాయి అధికారులు స్పందించి అక్రమంగా వెలుస్తున్న రియల్ ఎస్టేట్ వెంచర్లపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

గునుపూడి హైస్కూలుకు ల్యాబ్ సామగ్రి వితరణ

నాతవరం, సెప్టెంబరు 18 : నాతవరం మండలం గునుపూడి హైస్కూల్‌కు రూ.40 వేల ల్యాబ్ మెటీరియల్‌ను ఎన్ఆర్ఐ రామచౌదరి తన మాతృమూర్తి సీతామహలక్ష్మీ జ్ఞాపకార్థంవితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సత్యనారాయణ, ఎంఈవో-2 వరహాలబాబు, హెచ్ఎం శివజ్యోతి, చమ్మచింత హైస్కూల్ హెచ్ఎం కె.శివరామప్రసాద్, సీఆర్పీ వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ల్యాబ్ సామగ్రిని అందజేస్తున్న ఎన్ఆర్ఐ రామచౌదరి

విద్యా శాఖలో కలకలం!

... 5వ పేజీ తరువాయి

అక్కడే మాటు వేసివున్న ఏసీబీ డీఎస్పీలు నాగేశ్వరరావు, రమ్యలు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం విద్యా శాఖ కార్యాలయంలో సాయంత్రం వరకు సోదాలు నిర్వహించి, పలు రికార్డులను పరిశీలించారు.

ఓపెన్ స్కూల్స్ పరీక్షా కేంద్రాల నిర్వహణకు గతంలో ఎన్ని విద్యా సంస్థలకు అనుమతులు ఇచ్చారు? ఆయా యాజమాన్యాల నుంచి తీసుకుంటున్న లంచం సొమ్ములో ఎవరెవరికి ఎంతెంత వాటాలు వెళుతున్నాయి? లేకపోతే లంచం వసూళ్లకు కోఆర్డినేటర్ ఒక్కడే బాధ్యుడా అన్న కోణాల్లో ఏసీబీ అధికారులు డీఈవో ఎంవీ లక్ష్మమ్మ, డిప్యూటీ డీఈఓ అప్పారావు, సమగ్ర శిక్షా అభియాన్ అధికారులు, వివిధ విభాగాల ఉద్యోగులను విచారించి, సమాచారం సేకరించి నట్టు తెలిసింది. లంచం తీసుకుంటూ పట్టుబడిన కుమార్ ను ఏసీబీ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

☛ సంక్షిప్తంగా..

చెరకు బకాయిలు విడుదల చేయాలి

కె.కోటపాడు, సెప్టెంబరు 18 : చెరకు రైతులకు పాతబకాయిలు చెల్లించి మహాజనసభ ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం షుగర్ ఫ్యాక్టరీ ఏరియా కార్యదర్శివనుము సూర్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 29న మహాజన సభ నిర్వహణకు ఫ్యాక్టరీ యాజమాన్యం సిద్ధపడుతోందని, చెరకు సరఫరా చేసిన రైతులకు రావలసిన బకాయిలు, 2022-23లో చనిపోయిన చెరకు రైతులు క్లైయిమ్‌లు సుమారు 400 పైబడి ఉన్నాయన్నారు. అలాగే 2023-2024లో 200 పైబడి రైతులకు బకాయిలు, వీటన్నింటికి సుమారు రూ.ఏడు కోట్లు ఇవ్వవలసి ఉందన్నారు. ప్రస్తుతం రైతులకు గిట్టుబాటు ధర లేక చెరకు పండించడానికి అయిష్టతతో వెనకాడుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం ఫ్యాక్టరీ యాజమాన్యం చెరకు టన్ను ఒక్కంటికి నాలుగువేల రూపాయలు మద్దతు ధర ప్రకటించాలని, చెరకు సప్లై చేసిన రైతులకు ఏడు రోజులకు పేమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

చెట్టుపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నీటి పర్యవేక్షణ దినోత్సవం


నమూనాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

నర్సీపట్నం రూరల్, సెప్టెంబరు 18 : ప్రపంచ నీటి పర్యవేక్షణ దినోత్సవం సందర్భంగా చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులు అవగాహన చిత్రాలు ప్రదర్శించారు. బుధవారం పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో భావి తరాలకు నీటి అవసరాలను గుర్తు పెట్టుకొని ఉన్న నీటి వనరులను ఏ విధంగా సంరక్షించుకోవాలో తోటి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పిట్ట రామకృష్ణ, భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఏవీ రాజ గోపాల్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

దేవరాపల్లి, సెప్టెంబరు 18 : దేవరాపల్లి, తారువ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు నిమిత్తం ఈ నెల 20న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 2 గంటల వరకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఏఈఈ కర్రి శంకరరావు తెలిపారు. దేవరాపల్లి సబ్ స్టేషన్ పరిధిలో మండల కేంద్రంలో మాత్రమే నిలుపుదల ఉంటుందని, తారువ సబ్ స్టేషన్ పరిధిలోని తెనుగుపూడి, వెంకటరాజపురం, గర్శింగి గ్రామాలకు సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు.

మండలాల్లో క్రీడా పోటీలు

మాకవరపాలెం, సెప్టెంబరు 18 : మండలంలో ఈ నెల 20, 21 తేదీల్లో జి.కోడూరు హైస్కూల్‌లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు జి.కోడూరు హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు నారాయణ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమికోన్నత పాఠశాలలు, హైస్కూలు చదువుతున్న విద్యారులు ఈ పోటీలకు అర్హులనితెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులకు ఈ నెల 25, 26 తేదీల్లో నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు.

చీడికాడ : ఈ నెల 20, 21 తేదీల్లో మండలంలోని చుక్కపల్లి హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్టు హెచ్ఎం బీవీ రమణ బుధవారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో జరిగే వాలీబాల్, కబడ్డీ, ఖో-ఖో, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 20న బాలురు, 21న బాలికలకు నిర్వహిస్తామని అన్నారు. ఎంఈవోలు కె.బొంజుబాబు, బీవీ రమణల ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

రావికమతం : ఈ నెల 19 నుంచి 21 వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు రావికమతం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం పి.మల్లికార్జునరావు బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా క్రీడా పోటీలలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అండర్-14, అండర్-17 విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఇతర వివరాల కోసం స్కూలులో సంప్రదించాలన్నారు.

దేవరాపల్లి : మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈనెల 20, 21 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో పడాల్ దాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

వినాయకుడిని దర్శించకున్న 'బూడి'


పూజల్లో పాల్గొన్న ముత్యాలనాయుడు

దేవరాపల్లి, సెప్టెంబరు 18 : స్థానిక రామాలయం వద్ద బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో జరిగిన అన్న సమారాధనలో మాజీ ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బుధవారం రాత్రి దర్శించుకున్నారు. ఎంపీపీ చింతలబుల్లి లక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వరదపురెడ్డి లలితానాయుడు, సింహాచలంనాయుడు, కేవీ రమణ బాలగణపతి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

స్థానిక రాజుల వీధిలో స్టైల్ బాయిస్ ఆధ్వర్యంలో వినాయక నిమజ్జన సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. మంగళవారం అన్న సమారాధన చేశారు. లడ్డూను వేలం పాట నిర్వహించగా పట్నాల బ్రదర్స్ కైవసం చేసుకున్నారు.

అన్న సమారాధన

చీడికాడ, సెప్టెంబరు 18 : వినాయక ఉత్సవాల్లో భాగంగా దిబ్బపాలెంలో బుధవారం భారీస్థాయిలో అన్నసమారాధన నిర్వహించారు. కూటమి పార్టీల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీడీపీ నేత పైలా ప్రసాదరావు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ దారపు పెద్దినాయుడు, కూటమి నేతలు గౌరీపట్టపు నానాజీ, తాడి రాము, ఎం.కన్నంనాయుడు, గౌరునాయుడు పాల్గొన్నారు.